
ప్రజాశక్తి
శుక్రవారం 14 జూన్ 2024
5
పార్వతీపురం మన్యం



23న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

కొప్పల వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 23న మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్టు భాస్కరా విద్యాసంస్థల అధినేత చుక్క భాస్కరరావు, మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్ గురువారం విలేకరులకు తెలిపారు. గురువారం వారు మాట్లాడుతూ, నిరుద్యోగ యువతీ యువకులు అమెజాన్ సంస్థ లో ఉద్యోగాలకు కెఎల్ గ్రూప్ కన్సల్టెన్సీ వారు ఈ జాబ్ మేళా నిర్వహిస్తారన్నారు. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మన్యం జిల్లాలోని 10వ తరగతి నుంచి డిగ్రీ చదివిన నిరుద్యోగ యువతీ యువకులు అర్హులన్నారు. కార్యక్రమంలో కొప్పుల వెలమ సంక్షేమ సంఘం అధ్యక్షులు చల్లారపు రమేష్, సభ్యులు కార్తీక్, తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సమస్యల కొలువు

పక్కా భవనలు, ప్రహరీలు కరువు



ఇరిడిలో రేకుల షెడ్డులో విద్యార్థులకు తరగతుల బోధన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పాఠశాలలు గురువారం నుంచి పునః ప్రారంభమయ్యాయి. పాఠశాలలకు వస్తున్న విద్యార్థులకు సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. మండలంలోని 170 పాఠశాలల ఉన్నాయి. ఇందులో మండల పరిషత్ 56, ప్రభుత్వ ప్రాథమిక 32, ఆశ్రమ పాఠశాలలు 13, ఎయిడెడ్ 4, గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలలు 65ఉన్నాయి. తాడికొండ, దుడ్డుఖల్లు, కొత్తగూడ, కోసింగి భద్ర, టిక్కబాయి ఆశ్రమ పాఠశాలలకు ప్రహరీలు లేకపోవడంతో విద్యార్థులకు రక్షణ కరువైంది. అడవి, కొండలు సమీపంలో పాఠశాలల నిర్వహణ ఉండడంతో రాత్రి వేళల్లో ఏదైనా అడవి జంతువు, విష సర్పాలు వచ్చే ప్రమాదం అవకాశం విద్యార్థులు భయపడుతున్నారు. గతంలో విద్యార్థులు పాముకాటుకు గురై మృతి చెందిన సంఘటనలు ఉన్నాయి. అలాగే మండ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో రన్నింగ్ వాటర్ అందుబాటులో లేకపోవడంతో మరుగుదొడ్లు వినియోగం లేకుండా పోయాయి. ఆశ్రమ పాఠశాలల్లో ఎఎన్ఎం పోస్టులు భర్తీ చేయకపోవడంతో వార్డెన్లే నియమించుకొని నెలవారి కొంత మొత్తం చెల్లిస్తున్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుతోనైనా ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలను పరిష్కరించి విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం అందించే దిశగా చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పక్కా భవనం లేక.. రేకుల షెడ్డులో తరగతులు

జూన్ 13 పాఠశాలలు పునః ప్రారంభమైన పలుచోట్ల పక్కా భవనాలు లేకపోవడంతో విద్యార్థులకు రేకుల షెడ్డులోనే తరగతులను బోధిస్తున్నారు. మండలంలోని ఇరిడిలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 52 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారు. అయితే నాడు-నేడులో రూ.11 లక్షలతో పక్కా భవనం మంజూరైంది. పనులు ప్రారంభించి ఏడాదైనా భవనం పూర్తి కాకపోవడంతో ఈ ఏడాది కూడా రేకుల షెడ్డులోనే తరగతులు ప్రారంభించారు. నత్త నడకన పనులు జరగడంతో విద్యార్థులు ఎండకు, వర్షానికి ఇబ్బందులు పడుతూ చదువులు సాగించాల్సి వస్తుంది. సంబంధిత విద్యా, ఇంజనీరింగ్ శాఖ అధికారులు స్పందించి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నారు.



పునాది స్థాయిలోనే ఉన్న మండలపరిషత్ పాఠశాల నిర్మాణ పనులు

మొదటిరోజు మందకొడి హాజరు

ప్రారంభమైన పాఠశాలలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో పాఠశాలకు వచ్చే విద్యార్దులు సంఖ్య 50 శాతం దాటలేదు. 50 రోజులు పాటు ఆటపాటలతో గడిపిన విద్యార్థులు పాఠశాలలు స్కూల్ బ్యాగ్ లు పట్టుకొని ఆటోల్లో, సైకిళ్ల మీద పాఠశాలలకు చేరుకున్నారు. మొదటి రోజు పూర్తిస్థాయిలో విద్యార్థులు హాజరు కాకపోవడంతో పేర్ల నమోదు తరగతి పదోన్నతులు విద్యార్దులు ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ గడిపారు. వేసవి సెలవుల్లో ఆడిన ఆటలు, చేసిన పనులు గురుంచి విద్యార్దులు ముచ్చటించుకున్నారు. 50 రోజుల పాటు ఒకర్ని ఒకరు కలుసుకోకపోవడంతో వేసవి సెలవులో ఏం చేశారో మాట్లాడుకుంటూ పాఠశాలలో సందడి చేశారు. ఈ విషయమై స్థానిక ఎంఇఒ సామల సింహాచలం స్పందిస్తూ వేసవి సెలవులకు అలవాటు పడిన విద్యార్థులు హాజరు తొలి మూడు రోజులు తక్కువగానే ఉంటుందని, ఇప్పటికే విద్యార్దులకు పంపిణీ చేయడానికి కిట్లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. వాటిని పంపిణీ చేయడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. వారం రోజుల్లో విద్యార్థులకు పూర్తిస్థాయిలో టెక్స్ట్, నోట్ పుస్తకాలు, యూనిఫారాలు అందిస్తామన్నారు. జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలల ముందు టెన్త్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థుల ఫొటోలను ఫ్లెక్సీలు తయారుచేసి ప్రదర్శిస్తూ తల్లితండ్రులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నారు.



సాలూరురూరల్ : పాఠశాలకు వెళ్తున్న విద్యార్థులు



వీరఘట్టం : అరకొరగా తరగతులకు హాజరైన విద్యార్థులు

వీరఘట్టం: మండలంలో మొదటిరోజు తరగతులకు విద్యార్థులు పలచబడ్డారు. మండలంలోని పది జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 11 ప్రాథమిక ఉన్నత పాఠశాలలు , 39 ప్రాథమిక పాఠశాలలు, 1 కేజీబీవీ ,1 గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ఒకటో తరగతి నుండి పదో తరగతి వరకు 5766 మంది విద్యార్థులకు గానూ గురువారం 3295 మంది విద్యార్థులు హాజరైనట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.



ఇఎంఎస్ నంబూద్రిపాద్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న సిపిఎం నాయకులు

ఇఎంఎస్‌కు నివాళి

ప్రజాశక్తి - సాలూరు

దేశంలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత ఇఎంఎస్ నంబూద్రిపాద్ జయంతి సందర్భంగా గురువారం సిపిఎం పట్టణ కమిటీ నాయకులు, కార్యకర్తలు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎన్వైనాయుడు మాట్లాడుతూ దేశంలో కమ్యూనిస్టు, కార్మిక ఉద్యమాల నిర్మాణంలో ఇఎంఎస్ నంబూద్రిపాద్‌ది చెరగని ముద్ర అని అన్నారు. 1931లోనే కళాశాల విద్య ఆపేసి కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో పాల్గొన్నారని తెలిపారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం పట్టణ నాయకులు టి.రాముడు, స్వప్న, భాస్కరరావు పాల్గొన్నారు.

సస్పెండ్ చేసిన వారిని విధుల్లోకి తీసుకోవాలి

ప్రజాశక్తి - విజయనగరం

మోడల్ కోడ్ ఆఫ్ కాండాక్టు పేరుతో అక్రమంగా సస్పెండ్ చేసిన ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు చింతపల్లి సుందరయ్యతోపాటు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 54మందిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని ఆ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు గురువారం స్థానిక ఆర్టీసీ డిపో వద్ద నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ డిపో అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్‌వి రావు, ఎ.చంద్రయ్య, సభ్యులు కెఆర్ కుమార్, బిఎస్ రావు, బి.లక్ష్మి, ఎస్‌కె రాణి, జెఎస్ నారాయణ, సిహెచ్ఎస్ నాయుడు, ఎస్‌బి నాయుడు పాల్గొన్నారు.

ఐటిడిఎకు ఇన్‌ఛార్జిలే దిక్కు

- అధికారులకు తప్పని తిప్పలు
- ముందుకు సాగని అభివృద్ధి

ప్రజాశక్తి -సీతంపేట

ఐటిడిఎ అంటే గిరిజనులకు ఒక కలెక్టరేట్ తో సమానం. మారుమూల గిరిజన గ్రామాల సైతం గిరిజనులు తమ సమస్యలు స్పందనలో విన్నవించుకోవడానికి వస్తే ప్రాజెక్ట్ అధికారి ఆ సమస్యకు సంబంధించిన అధికారికి వెంటనే పరిష్కరించమని ఆదేశాలు జారీ చేసిన వెంటనే ఆ సమస్య పరిష్కారం జరిగేది ఒకప్పుడు. ఇప్పుడు ఇన్చార్జిల పాలన వల్ల ఆ పనులు జాప్యం జరగడంతో ఐటిడిఎపై గిరిజనులు నమ్మకం కోల్పోతున్నారు. గతంలో మాదిరిగా గిరిజనులను ఐటిడిఎ ఆదుకోవడం లేదన్న ఆరోపణ వినిపిస్తున్నాయి. సబ్సిడీపై రుణాలు, వాహనాలు ఇవ్వకపోవడంతో గిరిజనులు ఐటిడిఎ వైపు తొంగిచూడడం లేదు. ఒకవైపు గత ప్రభుత్వం కారణమైతే. మరోవైపు ఇన్చార్జిల వల్ల ఆ పనులు జరగడం లేదని అనడంలో అతిశయోక్తి కాదు.

సీతంపేట ఐటిడిఎ పరిధిలో 20 మండలాల పరిధిలో రెండు లక్షల గిరిజనులు ఉన్నారు. ఐటిడిఎకు అనుబంధంగా 22 శాఖలు ఉన్నాయి. వీటిలో ప్రధాన శాఖల్లో అధికారులు లేకపోవడంతో పరిపాలన సమస్యగా మారింది. ఐటిడిఎలో పరిపాలన అధికారి, మేనేజర్, అకౌంట్స్ మేనేజర్ వంటి కీలక పోస్టు గత మూడేళ్లుగా ఖాళీగా ఉండడంతో (ఎఎఒ) అసిస్టెంట్ అకౌంట్ అధికారి విజయరాణి ఇన్చార్జిగా ఈ మూడు విభాగాలకు వ్యవహరించడం ఆమె తలకుమించిన భారమవుతుంది. జిల్లా గణాంకాల అధికారి ఖాళీగానే ఉన్నా ఇన్చార్జి కూడా ఇవ్వలేదు. ప్రాజెక్ట్ హార్టికల్చర్ అధికారి ఎస్‌వి గణేష్‌కు ఇన్‌ఛార్జి ఐటిడిఎ ఎపిఒగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఐటిడిఎలో ప్రతి ఫైలు కదలాలంటే ఎపిఒ కీలకం. అటువంటి పోస్టు కూడా ఇన్‌ఛార్జికే అప్పగించారు. హార్టికల్చర్ అధికారి సొంత శాఖ కావడంతో ఖరీఫ్ సీజన్లో మరింత బిజీగా ఉంటుంది.

గిరిజన సహకార సంస్థ రాష్ట్ర పరిపాలన విభాగంలో జనరల్ మేనేజర్‌గా ఉన్న జి.సంధ్యారాణికి స్థానిక జిసిసి డివిజనల్ మేనేజర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ కె.విజయపార్వతికి డిఎంహెచ్ఒగా ఇన్చార్జి బాధ్యతలు అదనంగా అప్పగించడంతో సీతంపేట ఐటిడిఎ పరిధిలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పర్యవేక్షిస్తూ జిల్లాలోని అన్ని పిహెచ్‌సిలను చూడాల్సిన బాధ్యత ఉంది. ప్రస్తుతం జ్వరాల సీజన్ కావడంతో అదనపు బాధ్యతలు ఆమెకు తలకుమించిన భారం కావడంతో దేనికీ న్యాయం చేయలేని పరిస్థితి నెలకొంటుంది. అలాగే ఉపాధిహామీ ఎపిడిగా ఉన్న శ్రీహరి అదన బాధ్యతలు జిల్లా ఎపిడి కెపాసిటీ బిల్డింగ్ అధికారిగా అదనంగా ఇన్చార్జి బాధ్యతలు స్వీకరించడంతో తలకు మించిన భారమైంది. శ్రీకాకుళం వెలుగులో లైవ్ స్టాక్ డిపిఎంగా పనిచేస్తున్న ఎం.సన్యాసిరావు స్థానిక వెలుగు ఎపిడి ఇన్చార్జిగా వ్యవహరిస్తున్నారు. అక్కడ శ్రీకాకుళంలో డిపిఎంగా పనిచేస్తూ సీతంపేట ఎపిడిగా ఏడు మండలాల్లోని మహిళా సంఘాల రుణాలు మంజూరు, రికవరీ, బ్యాంక్ లింకేజీలు, విడివికెలను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఉంది. గిరిజనులకు సంపూర్ణంగా ఐటిడిఎ సేవలందలంటే ఐటిడిఎలో ఖాళీగా ఉన్న పోస్టులను కొత్తగా ఏర్పాటైన ప్రభుత్వం వెంటనే భర్తీ చేసి, గిరిజనాభివృద్ధికి కృషి చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



సీతంపేట ఐటిడిఎ కార్యాలయం



వర్షాల్లేక ఎండిపోయిన చెరువులు

'నైరుతి' కోసం రైతన్నల ఎదురుచూపు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

ఖరీఫ్ సీజన్ సమీపించడంతో జిల్లాలోని రైతులంతా పొలాలనన్ని హలాలతో దున్ని, నారుమల్లు సిద్ధం చేసుకుని విత్తనాలు సమకూర్చుకొని, కోటి ఆశలతో సాగుకోసం ఎదురు చూస్తున్నారు. మృగశిర కార్తి ముగిసిపోయి ఆరుద్ర సమీపిస్తున్నప్పటికీ వాతావరణం అనుకూలించక వానదేవుడు కరుణించక, నైరుతి రుతుపవనాలు మందగించడంతో, నారుమల్లు తడుపుకునేందుకు వర్షాల కోసం ఎదురుచూసే పరిస్థితి ఏర్పడింది. జూన్‌లో 3, 5 తేదీల్లో కురిసిన 24.1, 41.8 మిల్లీమీటర్ల వర్షమే తప్ప, ఆ తర్వాత వరుణుడు ముఖం చాటు వేయడంతో కర్షకులు ఖిన్నులవుతున్నారు. జిల్లాలోని 15 మండలాల్లో పాచిపెంట నుండి పార్వతీపురం మీదుగా పాలకొండ వరకు ఉన్న సాగుభూములు వర్షాల కోసం ఎదురుచూస్తున్నాయి. జిల్లాలో ఉన్న రెండు లక్షల ఎకరాలకు పైగా సాగు భూములు ఈ ఖరీఫ్‌లో వరి పండించడానికి అనువుగా ఉంటుంది. ఇందులో 40శాతం తోటపల్లి, వెంగళరావు సాగర్, జంఝావతి, పెద్దగెడ్డ, వట్టిగెడ్డ, నారాయణపురం, అంకలాం వంటి మధ్య, చిన్న తరహా ప్రాజెక్టుల్లో వచ్చే సాగునీటిపై ఆధారపడి ఉంటాయి. మిగతా 60 శాతం భూములన్ని చెరువులు, బోరు బావులు పైనే ఆధారపడి ఉంటాయి. ఈ ఏడాది ఇంతవరకు వర్షాలు కురువకపోవడంతో భారీ, మధ్యతరహా, చిన్న తరహా సాగునీటి ప్రాజెక్టులతో పాటు దాదాపు జిల్లాలోని చెరువులన్నీ ఖాళీగా మారాయి. జూన్ రెండో వారం దాటిపోయితున్నా వానల జాడ లేకపోవడంతో జిల్లాలోని రైతుల్లో ఆందోళన మొదలైంది. ఈ ఏడాది సాగుబడి నారుమళ్ళ స్థాయి కూడా దాటకపోవడంతో ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితుల్లో రైతులు ఉన్నారు. భారీ వర్షాలు కాకపోయినా కనీసం నారుమళ్లు తడిచేటట్లు అయినా వర్షాలు కురవక పోతాయా అని జిల్లా రైతాంగం ఆశగా ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు.

నిలిచిపోయిన నాడు-నేడు రెండోదశ పనులు

- పాఠశాలల్లో అరకొర తరగతి గదులు
- పనులు ఎప్పటికి పూర్తయ్యేనో?
- ఇబ్బందులు పడనున్న విద్యార్థులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రారంభించిన మనబడి నాడు-నేడు కార్యక్రమం నిధుల కొరతతో పడకేసింది. ఈ నేపథ్యంలో రెండోదశ పనులు అస్తవ్యస్తంగా మారాయి. పేరుకు ప్రతిష్టాత్మక కార్యక్రమమే అయినా నిధుల విడుదలలో మాత్రం చిట్టచివర నిలవడంతో చాలాచోట్ల పనులు ఆగిపోయాయి. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 737 పాఠశాలల్లో రూ.231.24 వేల కోట్ల అంచనాతో నాడు-నేడు రెండో విడత పనులను 2021 ఆగస్టులో ప్రారంభించారు. మూడేళ్లు దాటిపోయినా ఇప్పటివరకూ విడుదల చేసిన నిధులు కేవలం రూ.49.59 కోట్లే. మిగిలిన నిధుల విడుదలకు ఎంతకాలం పడుతుందో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. వైసిపి ప్రభుత్వం ఓడిపోయి టిడిపి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులపై ఎటువంటి చర్యలు తీసుకుంటారో చూడాల్సిందే.

నిధుల విడుదలలో వైఫల్యం

నాడు-నేడు నిధులు గత మూడేళ్లుగా విడుదల చేయకుండా వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్యం చేసింది. ప్రపంచ బ్యాంకు నుంచి కొంతమేర రుణాన్ని సమీకరించి 20 శాతం వరకు నిధులు విడుదల చేశారు తప్ప పూర్తి స్థాయిలో ఇవ్వలేదు. ఇలా వివిధ రూపాల్లో సమీకరిస్తున్నా సక్రమంగా నిధులు విడుదల చేయడంలో వైసిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఇటీవల మెటీరియల్ ధరలు భారీగా పెరిగిపోవడంతో ప్రభుత్వం అరకొరగా ఇస్తున్న నిధులు ఏమూలకూ సరిపోవడం లేదు. నిధులు విడుదల కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో పాఠశాలల్లో వసతుల కొరత వెంటాడుతోంది. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక ఇబ్బందులు పడే పరిస్థితి నెలకొంది.

విజయనగరం జిల్లా కేంద్రంలోని బాబామెట్టలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వసతులు చాలని కారణంగా 15 గదులు అదనంగా నిర్మించేందుకు నాడు-నేడు కార్యక్రమం కింద రూ.1.74 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చారు. మొదటి విడతగా రూ.35.6 లక్షలు విడుదల చేశారు. ఈ నిధులు ఉన్నంత వరకు నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మిగిలిన పనులు అర్ధాంతరంగా నిలిచిపోయాయి. జిల్లాలో 737 పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఎప్పటికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందో, ఎప్పటికి రెండో విడత నాడు-నేడు పనులు పూర్తి అవుతాయో కొత్త గా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం ఏమి చేస్తుందో వేచి చూడాల్సిందే.



నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన బిపిఎం హై స్కూల్ భవనాలు

25 శాతానికి మించి జరగని పనులు

2021 ఆగస్టులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మనబడి నాడు - నేడు కార్యక్రమం రెండో విడత పనులకు శ్రీకారం చుట్టారు. 2022 జూలై నాటికి పనులు పూర్తిచేస్తామని అప్పట్లో ప్రకటించారు. అయితే పరిపాలనా అనుమతులు ఇచ్చేందుకే సుమారు ఏడాది సమయం పట్టింది. ఇప్పటివరకు కేటాయించిన నిధులతో 25శాతం పనులు మాత్రమే జరిగాయి. 2024 విద్యా సంవత్సరం వచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వం కూడా మారిపోయింది. అయినా నిధులు విడుదల చేయలేదు. ఇప్పటివరకూ విడుదల చేసిన నిధులతో పనులు చేసిన ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీల సభ్యులు రావాల్సిన వాటి కోసం ఎదురుచూస్తున్నారు.

సంధ్యారాణి రాకకోసం భారీ ఏర్పాట్లు


- విజయోత్సవ ర్యాలీ నిర్వహణకు సన్నద్ధం
- అమాత్యురాలికి అఖండ స్వాగతానికి సన్నాహాలు

ప్రజాశక్తి -సాలూరు

రాష్ట్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా పట్టణానికి వస్తున్న గుమ్మడి సంధ్యారాణి రాక కోసం నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఆమె రాక సందర్భంగా పట్టణంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నారు. సంధ్యారాణి పట్టణానికి మూడు, నాలుగు రోజుల్లో రానున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు పట్టణ, మండలాల నాయకులు పెద్ద ఎత్తున ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేసే పనిలో నిమగ్నమయ్యారు. రెండు దశాబ్దాల పాటు నియోజకవర్గంలో టిడిపి జెండా ఎగరని పరిస్థితుల్లో తాజా విజయం పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేగా గెలుపొందడం, సంధ్యారాణికి మంత్రి పదవి దక్కడంతో నాయకులు కార్యకర్తల్లో పట్టలేని సంతోషం కనిపిస్తోంది. ఆమె గెలుపు వెనుక పట్టణ ఓటర్లు కీలకపాత్ర పోషించడం, పట్టణ నాయకులు, కార్యకర్తలు ఐక్యంగా పని చేయడంతో సునాయాసమైంది. 20ఏళ్లుగా నడుస్తున్న ఏకరీతి పాలన మార్పు కావాలన్న పట్టణ ప్రజల కోరిక నెరవేరింది. గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతి పూర్తిగా మందగించడంతో ప్రజల్లో తీవ్ర అసంతృప్తికి కారణమైంది. కోటి ఆశలతో తాము గెలిపించుకున్న ఎమ్మెల్యే సంధ్యారాణి అమాత్యురాలిగా శనివారం పట్టణానికి రానున్న నేపథ్యంలో ఘనస్వాగతం పలికేందుకు నాయకులు కార్యకర్తలు అభిమానులు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు వేగావతి వంతెన నుంచి భారీ ర్యాలీతో ఆమెను తీసుకురావాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. మేళతాళాలు, మందుగుండు సామగ్రి పేలుళ్ల తో ఊరేగింపుగా పట్టణ ప్రధాన రహదారి మీదుగా విజయోత్సవ ర్యాలీ నిర్వహించేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.



సంధ్యారాణి రాకకోసం పట్టణంలో ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు



విద్యుత్ అలంకరణతో మున్సిపల్ కార్యాలయం

తొలి మహిళా మంత్రి గుమ్మడి

నియోజకవర్గం నుంచి గెలుపొందిన తొలి మహిళా ఎమ్మెల్యే సంధ్యారాణి తొలి మహిళా మంత్రిగా కూడా చరిత్ర పుటల్లో నిలిచిపోనున్నారు. రెండేళ్ల క్రితం ఏర్పడిన పార్వతీపురం మన్యం జిల్లాలో రెండో మహిళా మంత్రిగా నిలుస్తారు. జిల్లాలో తొలి మహిళా మంత్రిగా గత ప్రభుత్వం హయాంలో పని చేసిన పుష్ప శ్రీవాణి నిలిచారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

జిల్లాలోని పలుగ్రామాల్లో పెద్దఎత్తున పారిశుధ్య పనులు జరిగాయి. ఇందులో భాగంగా పార్వతీపురం మండలంలోని గోచెక్క, తాళ్లబురిడి, డోకిశిల, పిబి పల్లి, కవిటిభద్ర, భామిని మండలం కొత్తగూడ, సందివలస., పాలకొండ మండలం లుంబూరు, ఎల్ ఎల్ పురం, గుమ్మలక్ష్మీపురం మండలం మండ, తాడికొండ, వనకాబడి, బాలేను, కుక్కి, గుమ్మలక్ష్మీపురం, కేదారిపురం, ఆర్ జమ్ము., సీతంపేట మండలం బుడగరాయి, వజ్జాయి గూడ, పాత పనుకువలస, కడగండి, పబ్బాడ, తుంబకొండ, గెద్దగూడ, చింతాడ, కుమ్మరిగొండ, కురుపాం మండలం ఊసకొండ, గొట్టిలి, జియ్యమ్మవలస ఆర్మడ తదితర గ్రామ పంచాయతీలతో సహా ఇతర మండలాలు, మున్సిపాలిటీలలో పారిశుధ్య డ్రైవ్ కొనసాగుతోంది. గ్రామాల్లో కాలువల్లో పూడిక తీత, దోమల లార్వా నివారణ పిచికారీ (ఏఎల్ఓ) కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. దోమల లార్వా వద్ధి చెందకుండా, దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు లార్వా నిరోధక రసాయనాలను పిచికారీ చేయించారు. జిల్లాలో మలేరియా, డెంగీ వంటి వ్యాధులు ప్రబలకుండా చర్యల్లో భాగంగా దోమలపై దండ యాత్ర చేపట్టారు. దోమల వ్యాప్తి నివారణకు అన్ని గ్రామాల్లో పారిశుధ్య డ్రైవ్ నిర్వహించి లార్వా వ్యాప్తి జరగకుండా చర్యలు చేపట్టారు. జిల్లా గ్రామ పంచాయతీ అధికారి, ఎంపిడిఒలు, జిల్లా మలేరియా అధికారి సమన్వయంతో పనిచేస్తూ చర్యలు చేపట్టారు. దోమల నివారణలో భాగంగా ఆయిల్ బాల్ లు, ఇతర కీటక నాశని పదార్థాలు ఉపయోగించడం, తాగు నీటి సరఫరా పైపుల పరిస్థితి తనిఖీ చేయడం, తాగు నీరు కలుషితం కాకుండా శ్రద్ధ వహించారు. బ్లీచింగ్ వేయడం, తుప్పలు తొలగింపు, బహిరంగ మలవిసర్జన చర్యలు చేపట్టారు. ప్రజారోగ్య ఆవశ్యకత దష్ట్యా పలు కార్యక్రమాలను నిర్వహించారు.

సీతంపేట : మండలంలోని కుడ్డపల్లి సచివాలయం పరిధిలో కుడ్డపల్లిలో గురువారం ఇఒపిఆర్‌డి కె.సత్యం, కార్యదర్శి వై.పాపారావు ఆధ్వర్యంలో పారిశుధ్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. పూడికలు దగ్గరుండి తీయించారు. స్ప్రేయింగ్ చేయించారు. దోమలను నివారించడానికి ఫాగింగ్ చేయించారు. అలాగే గ్రామాల్లో జ్వరాలు రాకుండా ఉండడానికి వైద్య సిబ్బంది ద్వారా అవగాహన కల్పించి మాత్రలు పంపిణీ చేయించారు. వేడి నీళ్ల తాగాలని అప్రమత్తంగా ఉండాలని వైస్ సిబ్బంది సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఇఒపిఆర్‌డి సత్యం మాట్లాడితూ గ్రామాల్లో జ్వరాలున్న సమస్యలు ఉన్న తమకు వెంటనే తెలియజేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి ఉన్న అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : స్థానిక మెయిన్ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్, సచివాలయం వీధుల్లో ఉన్న కాలువల్లో పూడిక తీతలను సర్పంచి గౌరీశంకరరావు దగ్గరుండి తీయించారు. ప్రజలు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని కోరారు. వీధుల్లో పాడైన విద్యుత్ దీపాలు వేయించడం, ఎక్కడైనా నీటి సమస్య ఉంటే తక్షణమే పరిష్కరిస్తున్నారు.

మంచినీటి బావుల్లో క్లోరినేషన్ చర్యలు చేపట్టాలి

గరుగుబిల్లి : వర్షాకాలం సీజన్‌లో వ్యాధులు ప్రబలకుండా ఉండేలా గ్రామపంచాయతీల్లోని మంచినీరు, బోరుబావుల్లో క్లోరినేషన్ చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని శివ్వాంలో గురువారం ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ ప్రభాకరరావుతో కలిసి మంచినీరు, బోరుబావుల్లో చేపడుతున్న క్లోరినేషన్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా డిపిఒ మాట్లాడుతూ పంచాయతీల్లోని మంచినీటి బావుల్లో క్లోరినేషన్ చేపట్టాలని ఇప్పటికే గ్రామపంచాయతీ కార్యదర్శులకు తెలిపామన్నారు. అదేవిధంగా మంచినీటి బావులతో పాటు బోరుబావుల సమీపాన మురుగు నీరు నిల్వ ఉండకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, మండల ఇంజనీరింగ్ అధికారి గోపీ, గౌరీశంకర్రావు, గ్రామ పంచాయతీ కార్యదర్శి బంటు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : మండలంలోని బల్లకృష్ణాపురం, నిడగల్లు, వెంకటాపురం, గుచ్చిమి, పలుకుపేట తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులను కెకె వర్మ పరిశీంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్యం తాగునీరు, వీధి దీపాల సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక మేజర్ పంచాయతీ కురుపాంలో యాంటీ లార్వా ఆపరేషన్ కార్యక్రమంలో భాగంగా గురువారం పంచాయతీ, వైద్య సిబ్బంది మురుగు కాలువలు, తాగునీటి బోర్లు సమీపంలో స్ప్రేయింగ్ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు దోమల బారిన పడి మలేరియా, డెంగీ వ్యాధులు సోకకుండా ముందస్తు చర్యల్లో భాగంగా లార్వా స్ప్రేయింగ్ చేయిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బి .అనిత వైద్య సిబ్బంది డి. పద్మ తదితరులు పాల్గొన్నారు.



సీతానగరంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న ఇఒపిఆర్ వర్మ



తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీనివాస్

తాగునీటి సరఫరాకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలోని పట్టణ ప్రజలకు కొళాయిల ద్వారా తాగునీటి సరఫరా జరిపేందుకు తోటపల్లి వద్ద ఉన్న బ్యారేజ్ ప్రాంతంలో రెండు బోర్లను ఏర్పాటు చేసి పంప్ హౌస్‌కు నీటి సరఫరా చేసేందుకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాస్ అన్నారు. గురువారం ఆయన మున్సిల్ డిఇ కిరణ్ కుమార్, ఎఇ జి.ఆనంద్‌తో కలిసి తోటపల్లి బ్యారేజ్ వద్ద ఉన్న ఇన్ ఫిల్టరేషన్ బాబురెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ ఏడాది నవంబర్ నుంచి పంట పొలాలకు నీటిని విడుదల చేసే నిమిత్తం ఇరిగేషన్ అధికారులు తోటపల్లి బ్యారేజ్ వద్ద ఉన్న అన్ని గేట్లు మూసి వేయడంతో పట్టణ ప్రజలకు తాగునీరు అవసరం దృష్ట్యా ఇరిగేషన్ డిపార్ట్మెంట్ అధికారులతో మాట్లాడి బ్యారేజ్ గేట్లను ఎత్తి తాగునీటి అవసరానికి సరిపడా నీటిని విడుదలయ్యేలా చర్యలు తీసుకున్నారు. దీంతోపాటు బ్యారేజీలో నీటి ప్రవాహం తగ్గినప్పుడు నీటి ఎద్దడి లేకుండా ఉండేందుకు ప్రత్యామ్నయంగా కొత్తగా రెండు రీఛార్జ్ బోర్లను పంప్ హౌస్ వద్ద ఏర్పాటు చేశారు.



చిన్నారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న సిడిపిఒ శ్రీనివాసరావు

అంగన్వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కేంద్రాల్లో గురువారం గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా 24ఎ, 24బి, 25 అంగన్‌వాడీ కేంద్రాలకు సంబంధించిన 16మంది విద్యార్థులు తమ పూర్వ విద్యను పూర్తిచేసుకుని ప్రభుత్వ పాఠశాలలో చేరినందుకు సంబంధించిన పత్రాలను పొందారు. తల్లిదండ్రుల సమక్షంలో వారికి స్నాతకోత్సవంలో గ్రాడ్యుయేషన్ పట్టా పొందే విద్యార్థులుగా అలంకరణ చేసి వారికి పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రాజెక్టు అధికారి శ్రీనివాసరావు, సూపర్వైజర్ అమ్మిరాజు, కార్యకర్తలు సహాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంపిటిసి పదవికి జగదీశ్వరి రాజీనామా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని ఎల్విన్‌పేట ఎంపిటిసి పదవికి తోయక జగదీశ్వరి రాజీనామా చేశారు. ఇటీవల జరిగిన సాధారణ ఎన్నికల్లో కురుపాం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి జగదీశ్వరి గెలుపు పొందారు. ఈ సందర్భంగా తాను ఎంపిటిసి పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఈనెల 6న జగదీశ్వరి గుమ్మలక్ష్మీపురం మండల పరిషత్ అధికారికి లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. ఈ లేఖను జడ్పీ సిఇఒకు పంపించడంతో ఆయన ఆమోదిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మలేరియా నివారణ మందులు అందుబాటులో ఉంచాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మండలంలోని ఆరోగ్య ఉప కేంద్రాల వద్ద మలేరియా మందులు అందుబాటులో ఉంచేలా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతికుమార్ కోరారు. ప్రస్తుతం గ్రామాల్లో మలేరియా జ్వరాలు ఎక్కువగా నమోదవుతున్నాయని, వైద్యం కోసం సబ్ సెంటర్ వద్దకు వెళ్తే ఇక్కడ మందుల్లేవని పిహెచ్‌సిలకు వెళ్లాలని వైద్య సిబ్బంది అంటున్నారని ఆయన తెలిపారు. దీంతో మలేరియా రోగులకు స్థానికంగా వైద్యమందని పరిస్థితి ఉందన్నారు. పది కిలోమీటర్ల దూరంలో ఉన్న పిహెచ్‌సిలకు రోగులు వెళ్లడం కష్టతరంగా ఉంటుందన్నారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి సబ్ సెంటర్ల వద్ద మలేరియా మందులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.



లోగోను ఆవిష్కరిస్తున్న యూత్ సభ్యులు

క్రీడాకారులను ప్రోత్సహించాలి

ప్రజాశక్తి - కురుపాం

గిరిజన ప్రాంతాల్లో గ్రామీణ క్రీడా ప్రతిభను వెలికి తీస్తే దేశానికి ఆణిముత్యాలు లభిస్తారని కురుపాం యూత్ సభ్యులు శరత్, నవీన్, ఇమ్మనియేల్ అన్నారు. గురువారం స్థానిక సాయిబాబా గుడి సమీపంలో ఉన్న గ్రౌండ్లో కురుపాం పేరుమీదుగా పుట్‌బాల్ జట్టు లోగోను ఆవిష్కరించారు. గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పాలకులు, అధికారులు ముందుకురావాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గత కొన్నేళ్లుగా కురుపాంలో కొంతమంది విద్యార్థులు పుట్‌బాల్ ఆటలో నైపుణ్యం పెంచుకుంటూ ఒడిశా, విజయనగరం తదితర ప్రాంతాలకు కూడా వెళ్తూ మెరుగైన ప్రతిభ కనబరుస్తున్నారు. అనంతరం క్రీడాకారులకు ప్రోత్సాకంగా జెర్సీలను అందజేశారు.

ఆర్‌జియుకెటి ప్రొఫెసర్‌కు అభినందన

ప్రజాశక్తి - సీతంపేట

ఐక్యరాజ్యసమితి పర్యావరణ విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ వ్యాప్తంగా ఈనెల 5న ఎన్విరాన్మెంటల్ డే జరిగింది. ఈ కార్యక్రమానికి శ్రీకాకుళంలోని ఆర్‌జియుకెటి అసిస్టెంట్ ప్రొఫెసర్ గేదెల రవి కాలేజీ ఆవరణలో "గో గ్రీన్" పేరిట మొక్కలను విద్యార్థులు, సిబ్బంది, డైరెక్టర్, స్టూడెంట్స్ వెల్ఫేర్ తదితర వారిచే నాటించారు. ఇందుకు సంబంధించిన ఫొటోలను ఐక్యారాజ్యసమితి పర్యావరణ విభాగంలో ఆన్లైన్లో అప్లోడు చేశారు. దీంతో ఐక్యరాజ్యసమితి పర్యావరణ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ వాటిని పరిశీలించి గేదెల రవి కృషికి అభినందనలు తెలుపుతూ రాబోయే రోజుల్లోనూ పర్యావరణ పరిరక్షణకు తోడ్పాలని కోరారు.



విద్యార్థులు, అధ్యాపకులతో మొక్కలు నాటిస్తున్న ప్రొఫెసర్ రవి

సాగుభూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి - పాచిపెంట

కుడుమూరు రెవెన్యూ 48 సర్వేనెంబర్ 782 ఎకరాల్లో సాగు చేస్తున్న ప్రభుత్వ భూములకు సాగు పట్టాలు వెంటనే మంజూరు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం సీనియర్ నాయకులు కుడుమూరు భూ పోరాట కమిటీ కన్వీనర్ సూక్రు అప్పలస్వామి మాట్లాడుతూ తాతల కాలం నుంచి సాగు చేస్తున్న గిరిజనుల భూములకు నేటికీ హక్కులు కల్పించకుండా సర్వేలు చేసి రెండేళ్లయినా కాలయాపన చేస్తున్నారని, సర్వేలు చేసి ఆరు నెలల్లో పట్టాలు ఇస్తామని చెప్పిన గతరాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోలేదని ఇప్పటి ప్రభుత్వమైనా హక్కులు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మొకాసాదారుల పేరుతో ఇబ్బందులు కలుగజేసే సందర్భాల్లో పోరాటం చేస్తే ఇప్పుడు రెవెన్యూ అధికారులే సాగు చేయొద్దు, దుక్కులు దున్నదొద్దని, పంటలు వేయొద్దని అడ్డుకోవడం సరైంది కాదని అన్నారు. దీనిపైన అధికారులు, జిల్లా కలెక్టర్ స్పందించి గిరిజన కుటుంబాలకు న్యాయం చేయాలని కోరారు. అనంతరం తహశీల్దార్ పి.బాలకు వినతిని అందజేశారు. తహశీల్దార్ మాట్లాడుతూ పూర్తిస్థాయి వివరాలను తెలుసుకొని గిరిజనులకు న్యాయం చేయడానికి ప్రయత్నిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు, భూ పోరాట కమిటీ నాయకులు కల్యాణ్, శ్రీను, ఎర్రయ్య, తాడియ్య, భీమారావు, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఈశ్వరరావు

గురుకుల పాఠశాలల్లో సీట్లు పెంచాలి

ప్రజాశక్తి - కొమరాడ

ఎపి గిరిజన సంక్షేమ గురుకులం బాలుర పాఠశాలలో సీట్లు పెంచాలని గిరిజన సంఘం, సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పార్వతీపురం ఐటిడిఎ పరిధిలోని కొమరాడ, భద్రగిరి, పి.కోనవలస గ్రామాల్లో ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకులం బాలురు పాఠశాలలో ఉన్నాయన్నారు. వీటిలో ఒక్కొక్క స్కూల్లో సుమారు 480మంది విద్యార్థుల ఒకటో తరగతి నుంచి పదో తరగతి వరకు చదువుతున్నారన్నారు. వీటికి సంబంధించి ప్రతి ఏటా నాలుగో తరగతి చదివిన గిరిజన విద్యార్థులు ఐదో తరగతి ప్రవేశానికి గానూ పై తెలిపిన స్కూల్లో దరఖాస్తు చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. అయితే వీటిలో 80 సీట్లు ప్రతి స్కూల్‌కు పరిమితమై ఉండగా అందులో 70 సీట్లు మాత్రమే గిరిజన విద్యార్థులకు ఉన్నాయని, మిగతా 10 సీట్లు బిసి జనరల్ కింద కేటాయిస్తామని తెలిపారు. ఇలాంటి సందర్భంలో ఈ ఏడాది విద్యార్థులు ఎక్కువగా ఉండడం వల్ల ఆయా స్కూల్‌కు వెళ్లినప్పుడు కూడా అక్కడ పరిమితం 70 సీట్లు మాత్రమే ఉన్నాయని, మిగతావి జనరల్ 10 సీట్లు మొత్తం 80 సీట్లు మాత్రమే అని అక్కడ ప్రిన్సిపల్ చెప్పారన్నారు. ఇలాంటి సందర్భంలో ఎంతో బాగా చదివిన విద్యార్థులు కూడా సీట్లు రాక చాలా ఇబ్బంది పడే పరిస్థితి ఉందని ఉందన్నారు. కావున అధికారులు స్పందించి గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో సీట్లు పెంపుదల చేసి గిరిజన విద్యార్థులకు భరోసా కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రవి, వెంకట్రావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ సిగ్గుచేటు

ప్రజాశక్తి-పాలకొండ

అంతర్జాతీయ బాల కార్మిక వ్యవస్థ వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాలకార్మిక వ్యతిరేక మాసంగా జూన్‌లో నిర్వహిస్తున్న చైతన్య కార్యక్రమాల్లో భాగంగా గురువారం సీతంపేట మండలం జిల్లేడుపాడు, కోడిశ గ్రామాల్లో జన చేతన సంస్థ నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ప్రో చైల్డ్ గ్రూప్ - క్రాఫ్ వారు రూపొందించిన "మనం నిబద్ధతతో చర్యలు తీసుకుందాం - బాల కార్మికత్వాన్ని అంతం చేద్దాం" గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ కార్యదర్శి బగాది శశి భూషణ చౌదరి మాట్లాడుతూ దీనిపై పనిచేసే వ్యవస్థలు అమలుచేసే తీరుతెన్నుల లోపం కారణంగా బాల కార్మికులు వివిధ రూపాల్లో పెరిగారని అన్నారు. వీరి కోసం ప్రభుత్వం ఆపరేషన్ ముష్కన్ లాంటి ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తూ వివిధ పథకాల ద్వారా వారిని ఆదుకునేందుకు కృషి చేస్తుందని తెలిపారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనా క్రమంలో ప్రభుత్వాలు చేపడుతున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకుంటూ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించి జాగ్రత్తగా చూసుకోవాలని సూచించారు. లేకుంటే చట్టం ద్వారా జరిమానా, జైలు శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఇందులో భాగంగా జూన్ నెలాఖరు వరకూ గ్రామాల్లో, పాఠశాలల్లో చైతన్య పరుస్తూ ర్యాలీ, పోస్టర్లు అతికించుట మొదలైన కార్యక్రమాలు చేస్తున్నట్లు చౌదరి తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.ఆనప, ఎన్.ప్రకాశరావు, పి.శ్రీరాములు, ప్రశాంతి, పలువురు పిల్లలు, తల్లిదండ్రులు, యువత తదితరులు పాల్గొన్నారు.

విరగాసిన పనస

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలో శంభాంలో పనస ఇరగ్గాసింది. నేలకు తాకినట్టుగా పనస కాయలు ఉండడంతో చెట్టువైప ఆశ్చర్యంగా చూస్తున్నారు. పనస చెట్టు మొత్తం కాయలు కాయడంతో సంబంధించిన గిరిజన రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. చెట్టు కాయలు సాధారణంగా పైనే ఉంటాయి. అయితే ఈ చెట్టుకు అందుకోవడానికి సులభంగా నేలకు తాకి ఉండడంతో ఆశ్చర్యాన్ని కలిగించింది. పనసకాయ సైజు కూడా పెద్దదిగా ఉండడంతో ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు.



శ్రీదేవికి పిహెచ్‌డి ప్రదానం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యా లయం సిఎస్ఇ విభాగం స్కాలర్ గద్దె శ్రీదేవికి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ ప్రశాంత కుమార్ మహంతి గురువారం పిహెచ్‌డి ప్రదానం చేశారు. శ్రీదేవి చేసిన 'ఎ స్టడీ ఆన్ డ్రగ్ రెస్పాన్స్ అండ్ సెన్సిటివిటీ ప్రెడిక్షన్ ఆన్ కేన్సర్ ప్రొటీన్ యూజింగ్ రెగ్రెషన్ బేస్డ్ కన్వోల్యూషన్ నెట్ వర్క్స్ అండ్ కేన్సర్ డిసీజ్ క్లాసిఫికేషన్ యూజింగ్ ఫజ్జి సెట్స్' అనే పరిశోధన అంశానికిగాను ఈ అవార్డు లభించింది. డీన్ ప్రొఫెసర్ మురళీ పర్యవేక్షణలో ఈ పరిశోధన జరిగింది. రీసెర్చ్ డీన్ డాక్టర్ కె.విజయ్‌బాబు కన్వీనర్‌గా వ్యవహరించారు. ఈ సందర్భంగా పలువురు అధ్యాపకులు ఆయనను అభినందించారు.

విధులు సంతృప్తినిచ్చాయి

సీనియర్ అసిస్టెంట్ అప్పారావు



ప్రజాశక్తి - పార్వతీపురం

తన 39 ఏళ్ల ఉద్యోగ సర్వీస్‌లో నిర్వహించిన విధులు ఎంతో సంతృప్తిచ్చాయని పార్వతీపురం ఐటిడిఎ ఇంజనీరింగ్ విభాగంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న సురాన అప్పారావు అన్నారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయు సందర్భంగా 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే...

శ్రీకాకుళం జిల్లా పోలాకి మండలం ఈదులవలసలో నీలయ్య, దాలప్పమ్మ దంపతులకు జన్మించాను. ప్రాథమిక విద్య నా స్వగ్రామమైన ఈదులవలసలో సాగింది. ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు నరసన్నపేట జడ్పీహెచ్‌ఎస్ స్కూల్లో చదవగా ఓపెన్ యూనివర్సిటీలో ఇంటర్ పూర్తి చేశాను. మాది చిన్న రైతు కుటుంబం, ఆర్థిక ఇబ్బందుల్లో తల్లిదండ్రులు నన్ను చదివించడం వల్ల ఉద్యోగం సాధించి పైకి రావడం సంతృప్తినిచ్చింది. 1985 ఫిబ్రవరి 20న పార్వతీపురం ఐటిడిఎ ఇంజనీరింగ్ సెక్షన్‌లో అటెండర్‌గా నా తొలిత ఉద్యోగ ప్రస్తావనం ప్రారంభమైంది. 2016లో బిపిఒ ప్రమోషన్‌తో సాలూరు మండలం పి.కోనవలస బదిలీపై వెళ్లాను. ఇక్కడ 8ఏళ్లు పనిచేసే, 2023లో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోతిపై మళ్లీ ఐటిడిఎ ఇంజనీర్ సెక్షన్‌కు బదిలీపై వచ్చాను. అదే ఏడాది అక్టోబర్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా కూడా ఉద్యోగోన్నతి పొంది ఉద్యోగ పదవి విరమణ వరకు విధులు ఇక్కడనే కొనసాగుతున్నాయి. నా భార్య పార్వతి సహకారంతో కుమారులు రాజశేఖర్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ కాగా, భాస్కరరావు బిటెక్ చదివాడు. కుమార్తె సౌజన్య, అల్లుడు నీలకంఠం సిఆర్‌పిఎఫ్‌లో డాక్టర్, ఎస్సైలుగా పని చేస్తున్నారు. మరో కుమార్తె సంధ్యారాణి డిగ్రీ చదవగా, అల్లుడు ఉదయ్‌కుమార్ బిఎస్ఎన్ఎల్ ఉద్యోగిగా పనిచేస్తున్నారు. కుటుంబ సభ్యులను ఉన్నతులుగా తీర్చిదిద్దడంలో సఫలీకృతుడ్ని అయ్యాను. ఈ సర్వీస్ కాలంలో ఎటువంటి రిమార్కులు లేకుండా విధులు నిర్వహించి, పై అధికారులతో గుర్తింపు పొంది విధులు నిర్వహించడం సంతోషాన్నిచ్చింది.

ఎంఎంసి వైస్ చైర్మన్ రాజీనామా

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లా కేంద్రంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గంలో ఇంతవరకు వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన పట్టణానికి చెందిన వానపల్లి శంకరరావు తన పదవికి గురువారం రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని ఎఎంసి కార్యదర్శి కార్యాలయానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తనకు పాలకవర్గంలో వైస్ చైర్మన్ పదవిని వచ్చిందని, ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైసిపి పరాజయం చెందడంతో పాటు గత ఎమ్మెల్యే అలజంగి జోగారావు కూడా ఓటమిపాలవ్వటంతో నైతిక బాధ్యత వహిస్తూ ఈ పదవికి తాను రాజీనామా చేస్తున్నానని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి - సీతంపేట

మండలం చుట్టూ పక్కల గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఇఇ గోపాలకృష్ణ తెలిపారు. సబ్‌స్టేషన్ నిర్వహణ పనుల్లో భాగంగా చెట్లు నరకడం, మరమ్మతులు చేపట్టడం వల్ల ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు విద్యుత్తు నిలిపివేస్తున్నామని, వినియోగదారులు ఈ విషయమై గమనించారని కోరారు.



పుస్తకాల పంపిణీని పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ నారాయుడు

పాఠశాలకు పుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఐటికె పరిధిలో ఉన్న పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయాలని ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ పాలక నారాయుడు అన్నారు. గురువారం ఆయన స్థానిక ఎమ్మార్సీలో పంపిణీ చేస్తున్న పుస్తకాల పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు పాఠ్యపుస్తకాలు తప్పనిసరిగా వెళ్లాలని ఎంఇఒ ఆనందరావును ఆదేశించారు. అనంతరం సిరికొండలోని ట్రైబల్ వెల్ఫేర్ జిపిఎస్ పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థుల హాజరును పరిశీలించారు. పిల్లలకు ఆటపాటలతో బోధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.కోటిబాబు, జిసిటిఒ రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని మరుపెంటలో పాఠశాలలు పునః ప్రారంభమైన సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక. ఎంపియుపి పాఠశాలను సందర్శించారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యలు అడిగి జ్వరాలు, దగ్గు, జలుబు, మొదలగు ఆరోగ్య సమస్యలున్న వారిని గుర్తించి విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు వెంటనే జరిపి, తగు మందులు ఇవ్వాలని వైద్య సిబ్బందికి తెలిపారు. క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది తరచుగా స్కూళ్లను సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిశీలన చేయాలని ఆదేశించారు. వాడుక నీరు పరిసరాల్లో నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ క్రమంలో అక్కడ 6,7, తరగతుల్లో ఇద్దరు మానసిక పిల్లలు ఉన్నారు వారితో మాట్లాడి వారి ఆరోగ్యం అడిగి వారికి జాగ్రత్తగా చూడాలని టీచర్లుకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్‌ఎంలు సుధారాణి, రమణమ్మ ఉదయకుమారి, వైద్య సిబ్బంది సుమతీ, శిరీష, పకీర్ నాయుడు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.



విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేస్తున్న వైద్యాధికారి సంతోష్‌కుమార్

వాహనదారుల వద్ద ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరి

ప్రజాశక్తి - కురుపాం

వాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి అన్ని ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా ఉండాలని స్థానిక ఎస్సై షణ్ముఖరావు అన్నారు. గురువారం మూలిగూడ జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. ధ్రువీకరణ పత్రాలు లేని వాహనదారులకు అపరాధ రుసుం వేశారు. ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించి అన్ని ధ్రువీకరణ పత్రాలు కలిగి ఉండి వాహనాలు నడపాలని సూచించారు. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని వాహనదారులకు సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్ఐ షణ్ముఖరావు